ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబర్ 2025



జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు లేవు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో స్క్రబ్ టైఫస్ వైరస్ కేసులు లేవని జిల్లా ఇన్‌ఛార్జి వంగలపూడి మంత్రి అనిత చెప్పారు. డిఆర్‌సి సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలగురించి వివరించారు. స్క్రబ్ టైఫస్ వైరస్ లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలని, దీనికోసం జిల్లా సర్వజన ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఈ వ్యాధిపట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిని లేదా కొన్ని విభాగాలను తరలించే అంశాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి నివేదిక ఇచ్చాక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రజల ఆరోగ్యరీత్యా పంటల్లో ఎరువుల వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం సొమ్మును కేవలం 24 గంటల్లోనే రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. మహాకవి గురజాడ అప్పారావు ఇంటివద్ద నిఘాను పెంచాలని, దీనికోసం సిసి కెమేరాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి అనిత చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని మంత్రి చెప్పారు.

రెవెన్యూ, పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు రావాలి

- సమావేశాలు తప్ప సమస్యల పరిష్కారమేదీ?
- డిఆర్‌సిలో సభ్యుల ప్రశ్న
- విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిద్దాం
- అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత
- చెరకు రైతుల సమస్యలపై ప్రత్యేక సమావేశం : మంత్రి కొండపల్లి
- మాతృమరణాలు సంభవిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్
- జిల్లా సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రెవెన్యూ, పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు తేవాలని, విఆర్‌ఎ స్థాయి నుంచి ఈ మార్పులు రావాలని, రెవెన్యూ పోలీసు వ్యవస్థలో అవినీతి ఆరోపణలు వస్తున్నందున అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. డిఆర్‌సి సమావేశాలు నిర్వహించడమే తప్ప.. సమస్యలు పరిష్కారం కావడం లేదని మంత్రులు, ఎమ్మెల్యేలు అభిప్రాయం పడ్డారు. జిల్లా అధికారులు.. శాఖల మధ్య సమన్వయం లేదని, ఒక శాఖపై మరొక శాఖ అధికారులు నెట్టుకుంటున్నారని ఇది కరెక్ట్ కాదని సభ్యులు మండి పడ్డారు. ఈసారి జరిగే సమావేశాల్లో అధికారులు తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని జిల్లా ఇంచార్జి మంత్రి వంగల పూడి అనిత హెచ్చరించారు. ఇక నుంచి రెండు నెలలు ఒక సారి జిల్లా అభివృద్ధి సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

జిల్లా ఇంచార్జి మంత్రి వంగల పూడి అనిత అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా నేటి తరాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామనిపిలుపునిచ్చారు. విద్యార్థులకు నైతిక విలువలను బోధించడంతోపాటు ఫోక్సో తదితర చట్టాలపైన, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపైనా బాలురకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలవద్ద సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అధికారులు ఖచ్చితమైన వివరాలతో నివేదికలను తమకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రాజెక్టులు, నీటి పారుదలకు సంబంధించిన పలు అంశాలుపై చర్చించాల్సి ఉందని, అందువల్ల ఇరిగేషన్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పదిరోజుల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాజెక్టులకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన చర్చ సందర్భంగా, మంత్రి మాట్లాడుతూ మిల్లర్లు అదనంగా ఐదు కేజీల వరకు రైతులనుంచి తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఏ మిల్లరైనా రైతులనుంచి అదనంగా ధాన్యం తీసుకున్నట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విపరీతంగా ఎరువులు వేసి పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, కేన్సర్ కేసులు పెరిగిపోవడానికి కూడా ఇది ఒక కారణమని పేర్కొన్నారు. అందువల్ల సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, మార్కెటింగ్ సదుపాయాలను కల్పించాలని సూచించారు. మ్యుటేషన్లకు సంబంధించి రెవెన్యూశాఖలో అవినీతి ఎక్కువగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం క్రిందిస్థాయి నుంచి మార్పులు తేవాల్సిన అవసరం ఉందన్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు.

రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, చెరకు రైతుల సమస్యలపై చర్చించేందుకు, మద్దతు ధరకు అందించేందుకు ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సుగర్‌కేన్ అధికారిని ఆదేశించారు. సమావేశం పెట్టకుండానే మద్దతు ధరను ఎలా ప్రకటిస్తారంటూ కేన్ అధికారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సేంద్రీయ ఉత్పులను విక్రయించేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రస్తావించారు. ఇకెవైసిలో లోపాలు జరుగుతున్నాయని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంవల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. రీసర్వే, ఇళ్ల మంజూరుపై ఆయన ప్రశ్నించారు.

జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడైనా మాతృమరణాలు సంభవిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రశ్నలకు అధికారుల తరపున కలెక్టర్ సవివరంగా సమాధానాలిచ్చారు. స్క్రబ్ టైఫస్ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. పిహెచ్‌సిల్లోనే ర్యాపిడ్ టెస్టులు ఉన్నాయని, అక్కడ నిర్ధారణ అయితే కేంద్రాసుపత్రికి వచ్చి తదుపరి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనిపై తప్పుడు నివేదికలను ఇచ్చిన కొన్ని ప్రయివేటు ఆసుపత్రులకు నోటీసులిచ్చామని చెప్పారు. టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ గురించి జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ వివరించారు.

ఎంఎల్‌సిలు డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు, ఇందుకూరి రఘురాజు, కావలి గ్రీష్మ, ఎంఎల్‌ఎలు కోండ్రు మురళీమోహన్, బేబీ నాయన, లోకం నాగమాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తదితరులు మాట్లాడుతూ పలు ప్రజా సమస్యలను, తమ నియోజకవర్గాలకు చెందిన అంశాలను ప్రస్తావించారు.

సమస్యలపై గళమెత్తిన జెడ్‌పి ఛైర్మన్

సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. రైతుల సమస్యల విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. జిల్లాలో ఉన్న ఒకే ఒక్క సంకిలి షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలని సూచించారు. చెరకు మద్దతు ధర ఎవరిని అడిగి నిర్ణయించారని సుగర్‌కేన్ అధికారిని నిలదీశారు. చెరకు మద్దతు ధర విషయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన తర్వాత ప్రజాప్రతినిధులు సమక్షంలో మద్దతు ధర ప్రకటించాలని, అలాకాకుండా అధికారి నిర్ణయించడంపై సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే సుగర్ ఫ్యాక్టరీలను మూసి వేస్తున్నారని, సంకిలి ఒకటే ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు 10 సెంట్లు ఉన్న వారికి వర్తింపజేయడం లేదని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులందరికీ అన్నదాత సుఖీభవ అందేవిధంగా చూడాలని కోరారు. రైతుకు మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. జెడ్‌పి సమావేశంలో అనేక మార్లు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. పేదలకు అందించి ఇళ్ల నిర్మాణంలో ఖర్చును ప్రభుత్వం ఎంత మొత్తంలో పెంచిందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ ప్రశ్నించారు.

మంత్రి దృష్టికి తంగుడుబిల్లి సమస్యలు

నెల్లిమర్ల : తంగుడుబిల్లి రైతుల సమస్యలు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో రైతులు ఇంఛార్జి మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లో తంగుగుడుబిల్లిలో సుమారు 150 రైతు కుటుంబాలకు సంబంధించిన భూమికి సరైన రెవెన్యూ రికార్డులు లేకపోవడంతో, వారికి చట్టబద్ధమైన వారసత్వ బదిలీ జరగడం లేదని రైతులు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పంచాయతీకి చెందిన సర్వే నెం 72/1లో ఉన్న సుమారు 2.40 ఎకరాల నీటి వనరును (చెరువు) కొందరు వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. 150 కుటుంబాల రెవెన్యూ సమస్యలకు రికార్డులు లేవని చెప్పే అధికారులు, ఒక్క వ్యక్తి నీటి వనరును కబ్జా చేయాలనే ఆలోచనకు మాత్రం సాక్ష్యాలను సృష్టించే ప్రయత్నం చేస్తూ మద్దతు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇది ఎంతవరకు సమంజసమని, తమకు న్యాయం చేయాలని అని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, కలెక్టర్ వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టి, రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, నీటి వనరును పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు వెనుదిరిగారు.



ఉపాధికి ఎసరు

- 1.9లక్షల జాబ్‌కార్డులు తొలగింపు
- ఇకెవైసి పేరిట కిరికిరి
- అత్యధికంగా సంతకవిటి, బొబ్బిలి, దత్తిరాజేరు మండలాల్లో..
- నిధుల తగ్గించేందుకు సర్కారు కుతంత్రం

జిల్లాలో లక్షా 9వేల ఉపాధి కార్డుల తొలగింపునకు ప్రభుత్వం కసరత్తు చేసింది. వీరికి ఇక నుంచి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండబోదు. మస్టర్లలో పారదర్శకత పేరుతో ఇకెవైసి అనుసంధానం చేయడంతో ఉపాధి కూలీలపై తీవ్ర ప్రభావం పడనుంది. గడిచిన పదేళ్లగా ఏటా ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం నిధులు కోత విధిస్తున్న సంగతి విధితమే. దీన్ని మరింత తగ్గించేందుకు వీలుగా ఈసారి ఏకంగా జాబ్‌కార్డులనే తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో 6లక్షల 23వేల 471 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఇకెవైసి చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో, ఇప్పటి వరకు కేవలం 5,14 465 జాబ్‌కార్డుదారుల ఇకెవైసి చేయించుకున్నారు. మిగిలిన 1,09,006 మంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇకెవైసి చేయించుకోలేదు. వీరు కోరిన వెంటనే పని కల్పించే అవకాశం ఉండబోదని, తిరిగి ఇకెవైసి చేయించుకుంటే పునరుద్ధరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఉపాధి హామీ చట్టం ప్రకారం ఏడాదికి వంద రోజులు పనిదినాలు మాత్రమే ప్రభుత్వం కల్పిస్తోంది. దీన్ని 200రోజులకు పెంచాలని ఉపాధి కూలీలు, వారి తరుపున వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో పనిదినాలను పెంచాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా ఏడాదిలో 265 రోజులపాటు కూలీలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో చాలా మంది ఏడాదిలో కొన్ని రోజులు ఉభయగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ పనులకు, విశాఖ, హైదరాబాద్, చెన్నైయ్ వంటి మహానగరాల్లో భవన నిర్మాణ పనులకు వలసపోతున్న సంగతి విధితమే. ఈనేపథ్యంలో జిల్లాపై వలసకార్మికుల జిల్లా అనే పేరు కూడా నానుడిగా ఉంటోంది. ఇలా వలస వెళ్లినవారే ఆ లక్షా 9వేల మంది కూలీలు. వీరంతా ఉపాధి పనులు వినియోగించుకోగా మిగిలిన సమయంలో ఖాళీగా ఉండలేక వివిధ ప్రాంతాలకు వలసపోతూ ఉంటారు. ఇటువంటి పరిస్థితుల్లో జాబ్‌కార్డుల కోత అంటే నిజమైన వలసకూలీల పొట్టకొట్టడమేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 8మండలాల్లో ఐదువేలకుపైగా జాబ్ కార్డులు తొలగించారు. ఇదేమంటే ఇది తొలగింపు కాదని, ఇకెవైసి నమోదు కాకపోవడం వల్ల హోల్డ్‌లో మాత్రమే పెట్టామని చెబుతున్నప్పటికీ, వారు వివిధ వలస ప్రాంతాల నుంచి వచ్చి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండే పరిస్థితి లేదు. ఇలా వచ్చినవారు ఇకెవైసి కోసం ఎన్ని తిప్పలు పడాల్సివుంటోందని చెప్పనవసరం లేదు. జిల్లాలో అత్యధికంగా సంతకవిటి మండలంలో 6,915కార్డులు తొలగించారు. బొబ్బిలిలో 5,821, దత్తిరాజేరులో 5,759, రామభద్రపురంలో 5,655, తెర్లాంలో 5,520, వంగరలో 5,320, రేగిడి ఆమదాలవలసలో 5,267, మెరకముడిదాం మండలంలో 5,118 చొప్పున జాబ్‌కార్డులు తొలగించారు.

అక్రమ మైనింగ్‌దారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

అక్రమ మైనింగ్ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కూర్మనాథరావు అన్నారు. మండలంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను అరికట్టడానికి రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ, మైనింగ్‌శాఖల అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో తహశీల్దారు కూర్మనాధరావు, ఎంపిఐ దుర్గాప్రసాద్, ఆర్ఐ రాజు, పోలీస్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా తవ్వకాలు చేపడితే కేసులు పెడతామని తెలిపారు.

రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ దీక్ష విరమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం రైల్వే క్రూ లాబీ ఆఫీస్ వద్ద మంగళవారం ఉదయం ప్రారంభించిన 48 గంటల నిరాహారదీక్ష ను గురువారం ఉదయం 10గంటలకు సిఐటియు జిల్లా కోశాధికారి ఎ. జగన్మోహన్‌రావు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై రైల్వే బోర్డు, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఇంత ఆధునిక సమాజంలో వారంలో ఒక్కరోజు కూడా కుటుంబంతో ఉండేందుకు అవకాశం లేకుండా రన్నింగ్ స్టాఫ్ పై పని భారాన్ని పెంచడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సరుకు , ప్రజా రవాణాలో అత్యంత కీలకమైన రైల్వేలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే బోర్డు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్ల లాభాల కోసం రైల్వే ను అంచలంచెలుగా ప్రైవేటీకరణ చేస్తుందని, ఖాళీలు భర్తీ చేయడం లేదని, ఉన్న స్టాఫ్ పైనే పని భారం పెంచుతోందని అన్నారు. ఇటీవల తరచూ రైల్వేలో జరుగుతున్న ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పాలకులకు చీమకుట్టినట్టు లేదని, పైగా ప్రమాదాలకు సిబ్బందిని బాధ్యులను చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్నా టూల్ కిట్స్ రన్నింగ్ స్టాఫ్ తో మోయించడం, కనీసం మంచినీరు, టాయిలెట్ సౌకర్యం లేకుండా రోజుల తరబడి పని చేయించడం దారుణం అన్నారు. ప్రతి ట్రైన్ లో టూల్ బాక్స్ తో పాటు రన్నింగ్ స్టాఫ్ కోసం మంచినీరు, టాయిలెట్ సౌకర్యం, నాన్యమైన భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. 4 రాత్రి డ్యూటీల నుంచి రెండు రాత్రి డ్యూటీలకు కుదింపు తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. దీక్షలో బ్రాంచ్ కార్యదర్శి సి.ఎస్.రావు, అడిషనల్ డివిజనల్ కార్యదర్శి ఐ.సింహాచలం, లోకో గాడ్స్ యూనియన్ ట్రెజరర్ పి.రవి, జెడ్‌డబ్ల్యూసి మెంబర్ జి.ఎస్.కుమార్, శ్రామిక యూనియన్ కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే లోకో రన్నింగ్ సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న సిఐటియు జిల్లా కోశాధికారి జగన్మోహన్‌రావు

ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్

డిఐజి గోపినాథ్ జట్టి

ప్రజాశక్తి-రాజాం, సంతకవిటి, వంగర

రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవర్ చేపట్టాలని పోలీసు అధికారులను డిఐజి గోపినాథ్ జట్టి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రాజాం, సంతకవిటి, వంగర పోలీసు స్టేషన్లను సందర్శించారు. రికార్డులు, సిడి ఫైల్సు, పోలీసు స్టేషను ప్రాంగణాలను పరిశీలించి పోలీసు స్టేషను పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పోలీసు స్టేషన్లులో నమోదువుతున్న కేసుల దర్యాప్తు, పోలీసుల పనితీరును పరిశీలించామన్నారు. జీవితానికి హాని కలిగించే మత్తు పదార్థాలకు ప్రజలందరూ దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వలన కలిగే అనర్ధాలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాయకరావుపేట నుండి ఇచ్చాపురం వరకు అన్ని పోలీసు స్టేషన్లును కవర్ చేస్తూ అభ్యుదయం సైకిలు యాత్రను గత 20రోజుల నుండి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మద్దతు లభిస్తుందన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు, నిర్మూలించేందుకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు విద్యాసంస్థలు, ఎన్‌జిఒలు, ప్రజలు, యువత, తల్లిదండ్రుల నుండి సహకారం అవసరమన్నారు. సైబరు నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జాతీయ, రాష్ట్రీయ రహదారులపై స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించి, ఓవర్ స్పీడు, డ్రంకన్ డ్రైవ్, మైనరు డ్రైవింగుపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామన్నారు. నేరాల నియంత్రణకు రహదారుల పైన, వాణిజ్య సముదాయలు, అపార్టుమెంట్లులోను సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం, బధిరులకు చెవిటి మిషన్లు, ట్రై సైకిళ్లు అందజేసారు. రాజాం వైద్యుల సహకారంతో పోలీసు స్టేషనుకు వితరణగా అందించిన డ్రోన్‌ను డిఐజి ప్రారంభించారు. సచివాలయ మహిళా పోలీసులతో ముచ్చటించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, రాజాం సిఐ కె.అశోక్ కుమార్, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్‌ఐలు షేక్ శంకర్, ఆర్.గోపాలరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఐజి గోపినాథ్

ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించకుంటే చర్యలు

విజయనగరం టౌన్ : నగరంలో నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని విక్రయించడం గాని, వినియోగించడంగాని చేపట్టరాదని, ప్లాసిక్ట్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో గురువారం సర్కిల్ వారీగా ఆయా పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు టీములుగా ఏర్పడి వివిధ దుకాణాలపై దాడులు చేపట్టారు. టిఫిన్ దుకాణాలు, జ్యూస్ దుకాణాలు, పళ్ళ దుకాణాలు లలో దాడులు చేపట్టి ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వంటి నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు చిరు వ్యాపారులలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. మళ్లీ పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించి స్థానికుల నుండి పలు వివరాలను సేకరించారు. తడి చెత్త పొడి చెత్త అందిస్తున్న తీరు, రెండు బుట్టల విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. 56వ నెంబరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛ సచివాలయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్ ను సందర్శించారు.

అనధికార నిర్మాణాలు తొలగింపు

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక అధికారులు, సిబ్బంది గుర్తించిన అక్రమ నిర్మాణాలను, అనధికార కట్టడాలను తొలగించి వేస్తున్నారు. 29వ డివిజన్ మహాలక్ష్మి నగర్ లేఔట్ లో అనధికారికంగా నిర్మించిన అదనపు భవన నిర్మాణాన్ని గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ తరహా నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

ఘనంగా ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గాన గంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతిని పురస్కరించుకొని గురువారం నగరంలోని గుమ్చీవద్ద గల ఆయన విగ్రహానికి ఘంటసాల స్మారక కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.భీష్మారావు సారథ్యంలో పాలభిషేకం చేశారు. అనంతరం శివాలయంలో ఆయన పేరున పూజలు నిర్వహించారు. పేదలకు భీష్మారావు చేతుల మీదుగా వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శతాబ్ద గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని కొనియాడారు. ఆయన విజయనగరంలో మహారాజ ప్రభుత్వ సంగీత కళాశాలలో సంగీతం అభ్యసించి ప్రపంచ పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మహనీయుడని అన్నారు. ఆయన చేసిన సంగీత కార్యక్రమాలు పాడిన పాటలు నేటికీ చిరస్థాయిగా ఉన్నాయన్నారు. ఆయన గానమృతం అజరామరంగా నిలుస్తుంన్నారు. ఈ సందర్భంగా 5వ తేదీన సాయంత్రం ఆనంద గజపతి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు 12గంటల నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధ పెర్మిషన్ మాస్ట్రో పద్మశ్రీ శివమణికి సన్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక పీఠం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుప్తా, ఉపాధ్యక్షులు భోగరాజు సూర్యలక్ష్మి, కోశాధికారి అబ్బులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సంగీత కళాశాల పూర్వ విద్యార్థి ఘంటసాల వెంకటేశ్వరావు జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలోని ఘంటసాల విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు.



ఘంటసాలకు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు



రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 12,13,14 తిరుపతిలో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాటాడుతూ విద్యారంగ సమస్యలపై ఇప్పట ివరకూ జరిగిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణను ఈ మహాసభల్లో తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేటికీ సొంత భవనం లేకపోవడం, సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెరగకపోవడంతో విద్యార్థుల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనాలు పూర్తి కాలేదన్నారు. యువగళంలో నారా లోకేష్ ఇచ్చిన హామీ జీవో నెంబర్ 77 రద్దు అమలు కాలేదన్నారు.. పైగా ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వేల కోట్ల రూపాయలు స్కాలర్‌షిప్‌లు బకాయి ఉంచడంతో చదువులపై భారం పడుతోందన్నారు. మరిన్ని విద్యా రంగ సమస్యలపై ఎస్ ఎఫ్ఐ పోరాడేందుకు అవసరమైన ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.రాము, జిల్లా అధ్యక్షుడు చిన్నబాబు, జిల్లా కన్వీనర్ శిరీష పాల్గొన్నారు.

పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు రవికుమార్ హఠాన్మరణం



ప్రజాశక్తి-కొత్తవలస

వైసిపి సీనియర్ నాయకులు, కొత్తవలస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గొరపల్లి రవికుమార్ గురువారం హఠాన్మరణం చెందారు. ఆయన భౌతికకాయాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కొప్పలవెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడు సందర్శించి, నివాళి అర్పించారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి జయప్రకాశ్, కొత్తవలస ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

ఇంటర్వ్యూకు 8న హాజరు కావాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హత పొందినవారు ఈ నెల 8న ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కె.రేఖ గురువారం ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ, మ్యాథమెటిక్స్ ఈ సంవత్సరం ప్రారంభమైనందున, ఆయా సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీ చేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. దీనిలో భాగంగా మ్యాథమెటిక్స్, బోటని సబ్జెక్టులలో ఎంఎస్‌సిలో 55 శాతం మార్కులు సాధించి, పిహెచ్‌డి, నెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు సోమవారం మధ్యాహ్నం 2గంటలకు వాక్ - ఇన్ - ఇంటర్వ్యూకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని ఆమె కోరారు.

డిప్యూటీ ఎంపిడిఒగా పట్నాయక్

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఎంపిడిఒగా ఎస్‌విఆర్‌కె పట్నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా చోడవరం మండలం నుండి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. మండల పరిషత్ ఉద్యోగులు తలచుట్ల హరిబాబు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది డిప్యూటీ ఎంపిడిఒను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భాం మేజర్ పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం పాల్గొన్నారు.

గర్భాం కూడలి వద్ద స్టాపర్లు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం మూడు రోడ్ల కూడలి వద్ద బుధ రాయలవలస ఎస్ఐ జె.లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాదాలు నివారించే కార్యక్రమంలో భాగంగా తుప్పలు తొలగించి రోడ్డుకి ఇరువైపులా గురువారం స్టాపర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లోకేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మైనర్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస, వేపాడ, పెదగుడిపాల పాఠశాలలను ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలబ్రహ్మచారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. కిచెన్‌గార్డెన్, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల డైరీలను పరిశీలించారు. గురువారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు వారు పలు సూచనలు చేశారు.

వికలాంగులకు నోటీసులు

ప్రజాశక్తి-వేపాడ

మరోసారి పరిశీలనకు రావాలంటూ పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు పంపిస్తోంది. మండలంలో ఇంతవరకు ప్రభుత్వం మంజూరు చేసిన వికలాంగుల ధ్రువపత్రాలపై అనేక మంది పింఛన్లు పొందుతున్నారు. ప్రస్తుతం వారికి సచివాలయ సిబ్బంది నోటీసులు అందిస్తున్నారు. వికలాంగ ధ్రువపత్రం తీసుకుని, వారికి కేటాయించిన ఆస్పత్రికి ఈ నెల ఐదో తేదిన వెళ్లి, వెరిఫికేషన్ చేయించుకోవాలని నోటీసులను అందజేశారు.

పేద కుటుంబానికి 'కారుణ్య' చేయూత

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని దావాలవీధికి చెందిన ఈశ్వరమ్మ పక్షవాతం బారిన పడి ఆర్నెల్లుగా నిస్సహాయ స్థితిలో మంచానికే పరిమితమైంది. భర్త సంజీవరావు వృద్ధాప్యంలో ఉంటూ కుట్టుమిషనుతో వచ్చే ఆదాయంతో అతి కష్టమ్మీద కుటుంబాన్ని పోషిస్తున్నారు. పక్షవాతంతో ఉన్న భార్యకు మందులను కొనలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు, జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణ రూ.5 వేలతో కుటుంబానికి అవసరమైన బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరకులతోపాటు మందుల కొనుగోలుకు మరో రూ.5 వేలను గురువారం వారింటికి వెళ్లి అందించారు. రోటరీ ద్వారా కూడా సాయం చేస్తామని హామీనిచ్చారు. కారుణ్య కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు జి సిహెచ్ జి శర్మ రాజమ్మ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలో పప్పల లింగాలవలస - వీరసాగరం గ్రామాల మధ్య కోటి 20 లక్షల రూపాయలతో తారు రోడ్డు నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ గురువారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, చెల్లూరు సత్యారావు, ముకుందరావు, మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, కాంట్రాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

పురిటిపెంట ఇఒగా జగదీష్

ప్రజాశక్తి - గజపతినగరం



పురిటిపెంట ఇఒగా ఎం.జగదీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జామి మండలం అన్నంరాజుపేట పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై పురిటిపెంట పంచాయతీకి వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి పక్కా ప్రణాళిక ప్రకారం పనులు చేస్తామన్నారు. గ్రామ అభివృద్ధికి నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో వైజాగ్ ఆప్టికల్స్ ఆధ్వర్యాన గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైజాగ్ ఆప్టికల్స్ యజమాని భాష తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిస్టు ఆదిలక్ష్మి, క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్ అశ్విన్‌కుమార్, దివ్య ప్రశాంతి, వాసు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై కొరడా

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలో ప్లాస్టిక్ అమ్మకాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ షాపుల్లో అమ్మడంతో గురువారం మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు, కమిషనర్ రామలక్ష్మి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మూడు బృందాలుగా షాపులను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ అమ్ముతున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ అమ్మినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత బొబ్బిలిగా మార్చేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని చైర్మన్, కమిషనర్ కోరారు.

ఎంవిజిఆర్, పెన్నెంట్ టెక్నాలజీ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి- డెంకాడ

పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి, విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎంవిజిఆర్ కళాశాల, పెన్నెంట్ టెక్నాలజీస్ గురువారం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో పెన్నెంట్ టెక్నాలజీస్, సిహెచ్ఆర్ఒ అండ్ కంప్లైయన్స్ హెడ్ రవివర్మ దాట్ల, ఎంవిజిఆర్ కళాశాల డైరెక్టర్ పి.ఎస్.సీతారామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్, శిక్షణ అండ్ ప్లేస్మెంట్స్ డీన్ ఎం.సునీల్ ప్రకాష్, ఇతర డీన్లు, హెచ్ఒడిలు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వదిలేశారా.. వద్దనుకున్నారా?

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు

ఇబ్బంది పడుతున్న సచివాలయ, ఆర్ఎస్‌కె, వెల్‌నెస్ సెంటర్ల సిబ్బంది

ప్రజాశక్తి-వేపాడ

సచివాలయం, రైతు సేవా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్... ఈ పేర్లు దాదాపు ప్రతి పంచాయతీలోనూ తారస పడుతుంటాయి. గ్రామ స్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయాలనే సదుద్దేశంతో గత సర్కారు వీటికి అంకురార్పణ చేసింది. అదే సంకల్పంతో ఆయా కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యమో, అలసత్వమో.. కారణం ఏమైనా గానీ అనేక చోట్ల భవనాలు పూర్తికాకుండా పోయాయి. పునాదుల స్థాయిలోనే కొన్నిచోట్ల దర్శనమిస్తుంటే, భవన నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తీసుకురాలేని దుస్థితి ఇంకొన్ని చోట్ల నెలకొంది.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు), వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అప్పట్లో గ్రామాల్లో అందుబాటులో ఉన్న



ఆతవలో మధ్యలో నిలిచిపోయిన సచివాలయ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వెల్‌నెస్ భవనం

ప్రభుత్వ, ప్రయివేటు భవనాల్లో వీటిని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సచివాలయ, వెల్‌నెస్, ఆర్ఎస్‌కెల సిబ్బంది ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, సేవలను విస్తృతం చేసేందుకు వాటికి పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా సుమారు ఐదేళ్ల క్రితం వేపాడ మండలంలో 18 గ్రామ సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. అందులో ఆతవ, రామస్వామిపేట, కెజిపూడి, ఎన్‌కెఆర్ పురం భవనాలకు చేసిన పనులకు బిల్లులు కూడా చెల్లించారు. మిగిలిన పనులు చేయకుండా మధ్యలోనే నిలుపుదల చేశారు. ఈలోగా భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయనే కారణంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. కెజిపూడి సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది.

మండలంలో రైతు సేవా కేంద్రాలు 18 మంజూరయ్యాయి. అందులో కెజిపూడి, ఆర్ఎస్‌పేట, బొద్దాం, ఆతవ, వేపాడ, ఎన్‌కెఆర్‌పురం, కొంపల్లి గ్రామాల్లో నేటికీ నిర్మాణాలు పూర్తిచేయలేదు. వేపాడలో పునాదుల స్థాయిలోనే వదిలేశారు. కొంపల్లి, ఆతవలో భవన నిర్మాణం పూర్తిచేసినా, వైరింగ్ పనులు కాలేదు. దీంతో ప్రారంభానికి నోచుకోలేదు. దబ్బిరాజుపేటలో ఆర్‌బికె నిర్మాణానికి బిల్లులు పూర్తిగా చెల్లించినా, భవనం మాత్రం పూర్తికాలేదు. కెజిపూడి, ఆర్ఎస్‌పేటలో కోర్టు వివాదం వల్ల భవన నిర్మాణాలు పూర్తిగా ప్రారంభించలేదు. బొద్దాం, ఎన్‌కెఆర్‌పురంలో భవన నిర్మాణాలు ప్రారంభించనేలేదు. దీంతో అద్దె భవనాల్లోనే ఆర్‌బికెలు నడుస్తున్నాయి.

మండలంలో 16 వెల్‌నెస్ కేంద్రాలు మంజూరయ్యాయి. వేపాడ, బొద్దాంలో ప్రభుత్వ భవనాలు ఉండటంతో ఇక్కడ మంజూరు చేయలేదు. ఆర్ఎస్‌పేట, ఎన్‌కెఆర్‌పురం మినహా మిగతా చోట్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందులో ఆతవలో భవన నిర్మాణం పూర్తయినా వైరింగ్ పనులు పూర్తికాకపోవడంతో అందుబాటులోకి రాలేదు. ఆర్ఎస్‌పేటలో కోర్టు వివాదం వల్ల వెల్‌నెస్ కేంద్రం పనులు ప్రారంభించలేదు.

సిబ్బందికి ఇబ్బంది

మండలంలో గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, వెల్‌నెస్ భవనాలకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా నేటికీ పూర్తిచేయలేదు. దీంతో సిబ్బంది విధులకు ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు, రైతులకు సేవలు అందించక తప్పడం లేదు. ఇరుకు, శిథిల భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్‌కెపురం, ఆతవలో ఇరుగ్గా ఉన్న ప్రభుత్వ భవనాల్లోనే సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. శిథిల భవనాల్లోనే విధులు నిర్వర్తించడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. ఆయా కార్యాలయాలకు ప్రజలు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించాం

సచివాలయ, ఆర్ఎస్‌కె, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు చేపట్టినంత వరకు పూర్తిగా బిల్లులు చెల్లించాం. మిగతా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను కోరుతున్నా ముందుకు రావడం లేదు. మిగిలిన పనులు పూర్తిచేస్తే బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- ఆలీ, పంచాయతీరాజ్ జెఇ



ర్యాలీలో పాల్గొన్న డిఎస్‌పి భవ్యరెడ్డి,

గంజాయితో జీవితాలు చిత్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బొబ్బిలి, బాడంగి

గంజాయితో జీవితాలు చిత్తవుతాయని, విద్యార్థులు, యువత దానికి దూరంగా ఉండాలని డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర గురువారం బొబ్బిలి, బాడంగి మండలాల్లో సాగింది. బొబ్బిలి పట్టణంలో రాజా కళాశాల వద్ద సైకిల్ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. శ్రీవేణు గోపాలస్వామి ఆలయం వరకు ర్యాలీ సాగింది. బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి భవ్యరెడ్డి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ శరత్ మాట్లాడుతూ గంజాయి నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటు ఉదన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి పట్టణ, రూరల్ సిఐలు కె.సతీష్‌కుమార్, నారాయణరావు, బాడంగి ఎస్ఐ తారకేశ్వరరావు, అభ్యుదయ పాఠశాల ప్రిన్సిపల్ శారద, మానవ హక్కుల సంఘం నాయకులు మానస, అభిమాని అధ్యక్షులు రాజగోపాల్, రాజా కళాశాల ప్రిన్సిపల్ వీరేంద్రకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ

ప్రజాశక్తి-గంట్యాడ

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఎన్‌హెచ్ఎఐ పీడీ రోహిత్‌కుమార్ సూచించారు. గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్‌హెచ్ఎఐ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా గంట్యాడ, వసంత, పెదమజ్జిపాలెం, లక్కిడాం, పెంటశ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 135 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. పిల్లల్ని ఫోన్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ డిప్యూటీ మేనేజర్ కిరణ్‌కుమార్, చరణ్, పిఎస్‌కె ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి ఎస్.రాజశేఖర్, తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, ఎంఇఒ వెంకటరావు, ఎఇ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఝాన్సీ పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు



పంచాయతీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-రామభద్రపురం

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గురువారం సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవ చేస్తున్న వారి శ్రమను గుర్తించకపోవడం అన్యాయమన్నారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ప్రమాదబీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. మండల కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో ప్రభుత్వం జారీ చేసిన జిఒ ఎంఎస్ 132 ప్రకారం ప్రతి నెలా ఐదో తేదీలోపు సిఎంఎఫ్ఎస్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. పంచాయతీలకు సమకూరే ఆదాయంతో ముడిపెట్టకుండా నేరుగా ప్రభుత్వమే ఈ జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఇఒపిఆర్‌డి వెంకటరమణకు వినతి అందజేశారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి ఇందును అభినందిస్తున్న వైసిపి నాయకులు

జాతీయస్థాయి క్రీడాకారునికి సత్కారం

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకుంటున్న ఇందు అనే క్రీడాకారిని జాతీయ స్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం వైసిపి నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో చదువుకుంటున్న కిలారి ఇందు జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్షిప్ పోటీలలో ప్రతిభను చాటడాన్ని అభినందిస్తూ స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మీసాల వరహాల నాయుడు తదితరులు క్రీడాకారునికి సత్కరించి అభినందించారు. జమ్మూ కాశ్మీర్లో జరిగిన 42వ జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్షిప్ పోటీలలో మిక్స్‌డ్ డబుల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున ఇందు పాల్గొని బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం పిఇటి రామారావును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెల్లాన త్రినాథ, పిసిని శ్రీను, ఎంపిటిసి ఆదినారాయణ, రాము, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జిఎస్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి బివిఎస్ సుధాకర్‌పట్నాయక్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, జిఎస్‌డబ్ల్యుఎస్3 టైర్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికులను పట్టించుకోవడం లేదు

మాజీ మంత్రి ఎదుట జనసేన నాయకుల ఆవేదన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గ్రామాల్లో, మండలంలో పార్టీ నాయకులను కూటమి నేతలు పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ మండల అధ్యక్షులు చప్ప అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు మాజీ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు పడాల అరుణ, నియోజకవర్గ సమన్వయకర్త మర్రాపు సురేష్ ఎదుట సమస్యలను ఏకరువు పెట్టారు. గురువారం మండలంలోని కోమటిపల్లి-గర్భాం రోడ్డు కూడలిలో ఉన్న ప్రయివేటు కళ్యాణ మండపంలో జనసేన మండల అధ్యక్షులు చప్ప అప్పారావు, జిల్లా నాయకులు మామిడి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అప్పారావు మాట్లాడుతూ 'ఓట్లు వేసేటప్పుడు మేము అవసరం. గెలిచాక పెత్తనం వాళ్లా? శాసనసభ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన జనసేన నాయకులకు గ్రామాల్లో గాని, మండలంలో గాని ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కనీసం సమావేశాలకైనా చెప్పడం లేదు. ఈ విషయంపై పార్టీ పెద్దలు ఆలోచన చేయాలి' అని కోరారు. అనంతరం మాజీ మంత్రి పడాల అరుణ మాట్లాడుతూ గ్రామంలో ఎదుట వ్యక్తి మనల్ని గౌరవించలేదని



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన మండల పార్టీ అధ్యక్షులు అప్పారావు

కాకుండా, ప్రజలకు మనమేం చేస్తున్నామని అది గుర్తించాలని జన సైనికులకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన గజపతినగరం మండల అధ్యక్షులు మనకాల జగన్నాథంపాల్గొన్నారు.

పెదతాడివాడకు గోశాలలు ఇవ్వరా?

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ గ్రామానికి గోశాలలు ఎందుకు ఇవ్వడం లేదని, నాయకులు ఉన్న గ్రామాలకే ఇస్తారా, తమ గ్రామంలో నాయకులు, రైతులు లేరా? అని టిడిపి నాయకుడు చిరంజీవి రాజు, రైతులు గురువారం ప్రశ్నించారు. మండలంలో రెండు విడతలుగా గోశాలలు మంజూరైనప్పటికీ తమ గ్రామానికి ఒక్క గోశాలను కూడా ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు తమ గ్రామానికి గోశాలలు మంజూరు చేయలేదా లేక మండల ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు తమ గ్రామానికి ఇవ్వనీయడం లేదా అని ప్రశ్నించారు. మేజర్ పంచాయతీ అయినప్పటికీ తమకు ఒక్క గోశాల కూడా మంజూరు కాకపోవడానికి కారణమేంటని అన్నారు. మండలంలో రెండో విడతగా 64 గోశాలలు మంజూరైనప్పటికీ తమ గ్రామానికి ఒక్కటీ కేటాయించలేదన్నారు. గోశాలలు కావాలని 34 మంది దరఖాస్తులు పెట్టుకున్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉపాధి ఇసిఆర్ సన్యాసిరావుని ప్రజాశక్తి వివరణ కోరగా గ్రామంలో 34మంది గోశాలల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారని వాటిని ఉన్నతాధికారులకు పంపించామని, ఎందుకు మంజూరు కాలేదో తెలియదని చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన ఆల్తి అప్పలనాయుడు కోనేరులో పడి మృతి చెందాడు. అప్పలనాయుడు బుధవారం సాయంత్రం కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడి మృతి చెందాడు. మృతుడి భార్య ఆల్తి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి అశోక్ కుమార్ తెలిపారు

మహిళ అకౌంట్‌లో నగదు మాయం

కంటోన్మెంట్ : స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వసంత్ విహార్‌లో నివాసముంటున్న లడ్డ ఉమా తన అకౌంట్‌తో పాటు తన కుమారుడు అకౌంట్ నుంచి అక్టోబర్ 25, 26 తేదీల్లో రూ.68,472నగదు మాయమైందని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి కేసు దర్యాప్తు చేస్తున్నారు

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో గతనెల 23న నమోదైన కిడ్నాప్ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ రావు తెలిపారు. గురువారం రూరల్ సర్కిల్ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గతనెల 23న మధ్యాహ్నం విశాఖపట్నంకు చెందిన కోస్ట్‌గార్డు మహేష్ కుమార్ యాదవ్ విజయనగరంలో ఉన్న వాళ్ళ ఫ్రెండ్‌ని కలవడానికి వచ్చాడు. తన ఫ్రెండ్ని కలిసి ఇద్దరూ ఒక స్కూటీ మీద డెంకాడ నుండి రామనారాయణం వెళ్తుండగా మార్గమధ్యలో పడాలపేట వెళ్లే మార్గంలో కొంత మంది వ్యక్తులు కారు మీద వచ్చి స్కూటీని అడ్డగించి డిఎస్‌పినని చెప్పి అతన్ని బలవంతంగా కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారు. అక్కడినుంచి కారులో తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి డబ్బులు డిమాండ్ చేసి మెడలో చైన్, చేతి ఉంగరం, రూ. 10వేలులు దోచుకొని, తర్వాత రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఖాళీ పేపర్ మీద సంతకాలు పెట్టించి, 20లక్షలు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించి వైజాగ్‌లో విడిచిపెట్టారు. బాధితుడు ఫిర్యాదుమేరకు విజయనగరం రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసును ఛేదించేందుకు పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టగా, ఈనెల 3న మధ్యాహ్నం



నిందితులను చూపుతున్న రూరల్ సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ

విజయనగరం జిల్లా చెల్లూరు బైపాస్ రోడ్డు దగ్గర గల కెవిఆర్ లే అవుట్ వద్ద నిందితులు విజయనగరం కొత్తపేట కుమ్మరివీధికి చెందిన కిలపర్తి నాగంనాయుడు (38), గాజులరేగకు చెందిన కొన్న రామకృష్ణ, విశాఖలోని మధురవాడకు చెందిన బుడ్డ పరమేష్ (26), విశాఖ ఎంవిపి కాలనీకి చెందిన నేలతేటి చిరంజీవిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుండి 3 కారులను, 4 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నలుగురు నిందితుల కోసం గాలింపు చేపడుతున్నామని, త్వరలో పట్టుకుంటామని సిఐ బి.లక్ష్మణ రావు తెలిపారు.

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పిఎసిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారం కోరుతూ జరిగే ఉద్యమాలకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక అమర్ భవన్‌లో పిఎసిఎస్ ఉద్యోగుల సమావేశాన్ని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ సత్యారావు, బి.రామునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం గత 30, 40 సంవత్సరాలుగా పిఎసిఎస్‌లలో ఉద్యోగులుగా పనిచేస్తున్న వీరికి న్యాయం చేయాలన్నారు. ఉద్యోగులందరికీ వెంటనే జీవో నెంబర్ 36 అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మధ్యంతర భృతి వెంటనే ఇవ్వాలన్నారు. విజయనగరం డిసిసిబి పరిధిలోగల 95 పిఎసిఎస్‌లలో ఉన్న 300 మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6 నుండి వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. 8న రాష్ట్రవ్యాప్తంగా డిసిసిబి కార్యాలయాల వద్ద , 16న జిల్లా సహకార కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని తెలిపారు. 29న రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ డి.నారాయణరావు, ట్రెజరర్ ఎవి సత్యనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒ.గిరిబాబు, ఆర్ వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.